# ఎదపగిలిన వేళ

— హావిస్

"ఆవిడే రేణుక"

హేమలత నేస్తురాలు చూపించిన వంకచూసి "వొంటరిగా వొచ్చినట్టుందే?" అన్నది.

"ఆయనగారు పెద్ద ఆఫీసరుగదా? ఆయనకీ ఎగ్జిబిషనే పట్టిందా?"

హేమలత తల పంకించింది. రేణుక వాళ్ళు నిలుచున్నచోటికి కాస్త అవతలగా వున్న 'మస్తానా' స్టాల్‌లో అగర్ బత్తీలు కొంటున్నది. ఆమె వాలకంలో ఎక్కడా కలుపుగోలుతనపు ఛాయలు కనిపించలేదు. పలకరిస్తే ఏమవుతుందో అన్న గుంజాటనతో కొన్ని క్షణాలు వూరుకున్నది హేమలత. ఇంతలో రేణుక అగర్‌బత్తులపెట్టె పుచ్చుకుని ఆగుంపులోనుంచి యివతలకువొచ్చింది. నేస్తురాలివంకచూసి ఆమె యిచ్చిన భరవసాతో "మీపేరు రేణుక కదూ?" అన్నది హేమలత.

ఆమె అవునన్నట్లు తలవూపి 'ఎవరు మీరు?' అన్నట్లు చూసింది.

"నాపేరు హేమలత. మీవారి తరపున బంధువును." అన్నది హేమలత.

"అలాగా?" ఈసారి ఆమె బెదురు చూపులు చూడలేదు.

హేమలత నేస్తురాల్నికూడా ఆమెకు పరిచయంచేసి "సరదాగా హైద్రాబాదు చూడరమ్మని ఈమె పోరితే నిన్ననే వచ్చాను. మీ ఎడ్రస్ సరిగా తెలీకపోవటంవలన రాలేకపోయాను. శేఖరం కులాసాగా వున్నాడా? అన్నది.

"కులాసాగానే వున్నారు."

"మీరు అంతా చూచేశారా?"

"ఆ! ఇక యింటికి పోవటమే. రండి మీరుకూడా"

హేమలత నేస్తురాలివంకచూసి "వెళ్ళిరానా?" అన్నది.

"వొద్దంటే మానతావుగనకనా? రాత్రికయినా వొచ్చే వీలయితే రా" అన్నదామె నవ్వుతూ.

"అలాగే. నువ్విక్కడ ఉండిపోతావా?"

"ఆయనగారు రావాలిగా?"

"అయితే వొస్తాం"

నేస్తురాలిదగ్గర సెలవుతీసుకుని హేమలత రేణుకతో కలిసి రోడ్డుమీదికి వొచ్చింది. టాక్సీ ఎక్కాక "బహుశా నాసంగతి శేఖరం మీతో ఏమీ చెప్పి వుండడు" అన్నది హేమలత.

"లేదు. అందుచేతనే..." అన్నది రేణుక సందిగ్ధంగా.

"మాఅమ్మా శేఖరం నాన్న వేలువిడిచిన అప్పా తమ్ముడూను. అంటే శేఖరం నాకు బావ వరసఅన్నమాట ?''

"మీది బెజవాడకాదా ?"

''కొన్నాళ్లున్నా ననుకోండి. నేను స్కూల్ ఫైనల్ పాసయ్యాక గుంటూరు వెళ్ళిపోయాం అంతా. మా పెదనాన్నగారితోపాటు వుండవలసొచ్చింది. శేఖరం పెళ్ళినాటికి మా పెదనాన్నగారికి పెద్ద సుస్తీచేసింది. అంచేత ఎవరమూ రాలేకపోయాం"

"అందుకనే మిమ్మల్ని ఎప్పుడూ చూడటం పడలేదు''

హేమలత నవ్వి, సాలోచనగా "చిన్నప్పుడు తెగ అల్లరి చేసేవాడు. కామాచి కాయలని మా తాతగారి దొడ్లో కాసేవి. ఎఱ్ఱగా కుంకుడు గింజలంతేసి వుండేవి. రోజూ ఎవరూ యింకా లేవక ముందే పోయి కొసేసేవాడు. రహస్యంగా నాకు కాసినియిచ్చి ఆ తరువాత మిగతా పిల్లలందర్నీ వూరించి నానా అల్లరి పెట్టేవాడు" అన్నది.

''ఇప్పటికీ అంతే ఆయన" అన్నది రేణుక. ఆమె ముఖంలో మెరిసిన మధురానుభూతీసంజనితమైన సిగ్గు రేఖలకు ముగ్ధురాలై పోయింది హేమలత.

'అదృష్ట వంతుడు' అనుకున్నది.

టాక్సీ దిగాక "రండి"అన్నది రేణుక. ఆమె వెనుకే అయింటిని పరిశీలనగా చూస్తూ నడిచింది హేమలత. చాలా పెద్ద మేడ అది. ముందుపెద్ద కాంపౌండూ, అందులో క్రమశిక్షణలో పెరిగిన క్రోటన్సు. క్రీపర్లూ వున్నాయి. రేణుక వెంట మేడమీదికివెళ్ళింది హేమలత. రేణుక గబగబా లోపలకువెళ్ళి హేమలతను బైటనే ఆగమని సైగచేసి "మీకోసం ఎవరొచ్చారో చెప్పుకోండి'' అన్నది.

పేముసోఫాలో పేపరు చదువుకుంటున్న శేఖరం తొంగిచూసి "ఎవరు?" అన్నాడు.

''చెప్పుకోండి. పెద్ద ఆఫీసర్లుకదా ?"

"ఇది మరీబావుంది. వెనకటి కెవడో ఒడ్డూపొడుగూ వున్నావు తేలుమంత్రమైనా రాదా? అన్నాడట.''

రేణుక నవ్వి "అయితే చెప్పుకోలేనట్టేగా ?'' అన్నది.

''ఉహుం"

"రండి హేమలతగారూ'' అన్నది రేణుక.

హేమలత లోపలకు రాగానే ఆశ్చర్యంతో దిగ్గునలేచి నుంచున్నాడు శేఖరం. అతని వాలకంచూసి ఆడవాళ్ళిద్దరూ వొకళ్ళవంక వొకళ్లు చూసుకు నవ్వుకున్నారు, కొంత సేపటికి తేరుకున్న శేఖరం "నిజంగా హేమలతే ?" అన్నాడు తిరిగి సోఫాలో కూలబడుతూ.

''ముమ్మూర్తులా నేనే! కలకాదు'' అన్నది హేమలత.

రేణుక ఆమెను కూర్చోమని ''అయినా మీరింతతొందరగా ఎలారాగలి గారు ?'' అన్నది భర్తతో.

''పార్టీ అనుకోకుండా పోస్టుపోన్ అయింది...అది పోనీగాని ఈవిడెక్కడ తటస్థపడింది ?'' అన్నాడు శేఖరం.

"ఆ విషయాలు మీరిద్దరూ మాటాడు కోండి. నేనుపోయి బట్టలు మార్చుకు వొస్తాను.'' అన్నది రేణుక లోపలకు వెళుతూ.

హేమలత నవ్వుతూ తానూ రేణుకా ఎక్కడ ఎలాకలుసుకున్నదీ వివరిం చింది. చివర్న ''అదృష్టవంతుడివి శేఖరం" అన్నది.

శేఖరం చిన్నగా నవ్వేసి ''యింకా ఏమిటి విశేషాలు ?'' అన్నాడు.

"నీకు తెలీని వేముంటాయి ?"

"పెళ్లి చేసుకో నంటున్నావుటగా ?''

"ఏం ? చేసుకోమంటావా ?''

''అక్కడికి నా ఆజ్ఞకోసం నిరీ క్షిస్తున్నట్లు ?"

"ఎవరిదో వొకరిది – ఆజ్ఞ లేకుండా ఆడది ఏమీ చేయ్యలేదుగా ?''

శేఖరానికి ఆమాట అర్థంకాకపోలే దన్న సంగతి అతనిముఖమే చెప్పింది హేమలతకి. "చాలా మారిపోయావు సుమా ?'' అన్నాడతను.

"అల్ట్రా మోడర్న్ అయాననుకదూ? ఈ లో కట్ జాకెట్టూ, నైలాన్ చీరె'' ఆమాటలువింటూ శేఖరం లోపలిగుమ్మం వైపు చూడటం గమనించి ''మీ ఆవిడ వింటుందనా ?'' అన్నది హేమలత.

"అబ్బెబ్బే" అన్నాడు శేఖరం ఉలిక్కిపడి.

రేణుక తిరిగి వొచ్చింది. విజయవాడ లోనూ గుంటూరులోనూ వున్న బంధు వుల క్షేమ సమాచారాలన్నీ అడిగి తెలుసు కున్నది. ఆఖర్న "ఇవాళికి ఉండిపోండి" అన్నది.

''అంతేనా ?" అన్నది హేమలత.

"అయితే రేపూ–ఎల్లుండి, ఎన్నాళ్ళ యినా సరే''

"మీ ఆయన పర్మిషన్ లేకుండానే"

"ఆహా"

హేమలత శేఖరం నవ్వుతున్న బల వంతపు నవ్వుచూసి చాలా జాలిపడింది. తాను అలా అక్కడికి రావటం అతనికి యిష్టం వుండదన్న సంగతి తెలిసే వొచ్చింది. ఎన్నాళ్ళనుంచో అణగదొక్కు కున్న కోరిక, నేస్తురాలు హైద్రాబాదు రమ్మని ఆహ్వానించటంతో విజృంభిం చింది. శేఖరం యిట్లో రెండ్రోజులపాటు వుండవొచ్చునన్న ఆశే లేకపోతే వొచ్చి వుండేదికాదు. అతనేమో అనవసరంగా భయపడుతున్నాడు. ఎంత బలహీనులు మనుషులు ?

"రేపూ, ఎల్లుండీకూడా ఉండిపోతాను" అన్నది చటుక్కున.

''థేంక్యూ వెరీమచ్ ! మరీ వారం రోజులుగా బోరుకొట్టి చచ్చిపోతున్నా." అన్నది రేణుక.

శేఖరం చివాల్న లేచి లోపలకు వెళ్ళిపోయాడు.

*   *   *

మర్నాడు నిజంగానే నేస్తురాలి యింటి నుంచి తన బట్టలు తెచ్చేసుకున్నది హేమలత. శేఖరం ముభావంగా పలకరించినట్లు కనపడకుండా పలకరించి వూరుకున్నాడు. రేణుక కిదేమీపట్టలేదు. ఏవేవోకబుర్లు చెప్పేస్తూ ఉండిపోయింది. ఉన్నట్లుండి ''మీకు ఆ అమ్మాయి తెలుసా ?'' అన్నది రేణుక.

"ఏ అమ్మాయి ?" అన్నది హేమలత నవ్వుతూ.

''మన చుట్టాలట. బాగా చదువుకుని మీకుమల్లేనే ఉద్యోగంకూడా చేస్తోందిట, ఆయన ఎప్పుడూ చెబుతూంటారు ?"

''మన బంధువుల్లో అలాంటివారిద్దరు ముగ్గురున్నారు. మరి ఎవరి సంగతో?''

''పేరూ...'' గుర్తురాక కొంత సేపు గింజుకొని ''ఏంపేరయితేనేం లెండి, అదీగాక ఆయనెప్పుడూ చెప్పినట్టుగా కూడా లేదు ... ఉత్త అల్లరిమనిషిట, పెళ్ళికాకముందే గర్భవతైందిట. ఆయనకి అంట గడదామని ప్రయత్నిస్తే మావగారూ అత్తగారూ సాగనివ్వలేదుట'' అన్నది రేణుక.

హేమలత ముఖం వివర్ణమైంది.

''నిజమే. అలాంటి సంగతులు అనుకోవటానికికూడా బాగుండవు. కాని ఆ అమ్మాయి యిప్పుడు మరీ పేట్రేగిపోయిందనీ చాల అసహ్యంగా తయారైందనీ ఎవరో ఆయన్తో చెప్పారట ఈ మధ్య ... నాకు జాలేసింది సుమండీ.

''కొందరి జీవితాలు అంతే మరి.''

"మీరేమీ అనుకోనంటే వొక్కమాట చెబుతాను" అన్నది రేణుక అమాయకంగా.

"చెప్పండి."

"మిమ్మల్ని నిన్నచూసి ఆమే అనుకున్నాను"

హేమలతకు వొక్కక్షణంపాటు ఏమనాలో తోచలేదు. ఆతర్వాత బలవంతాన పెద్దగానవ్వి ''అయితే నా వేషం అంత ఘోరంగా వుందన్నమాట ?'' అన్నది.

''అలాగని కాదుగాని ..." అన్నదామె తత్తరపడుతూ.

''దాని దేముంది ?... మీరనుకున్న దాంట్లో పొరపాటు లేదు.''

రేణుక సంతృప్తి పడింది—హేమలత ఏమీ బాధపడలేదని. ఆతరువాత వారిద్దరి మధ్యా సంభాషణ కొనసాగలేదు. రేణుకకి దానిక్కారణం తాను తెలివితక్కువగా మాట్లాడటమేమోనన్న సంశయం కలిగి కొంతసేపటికి లేచి హేమలతను వొంటరిగా వొదిలి వెళ్ళిపోయింది.



ఆమె వెళ్ళిపోయాక హేమలతకి దుఃఖం ఆగలేదు. మంచంమీద వాలిపోయి భోరుమన్నది. రేణుకకి నిజం తెలిస్తే..

ఆ నిజం...

దాదాపు ఎనిమిదేళ్ళ క్రితం—

స్కూలునించి తిరిగివొచ్చి అమ్మ

యిచ్చిన కాఫీతాగి బట్టలు మార్చుకున్న హేమలత అలవాటు ప్రకారం మామయ్య గారి యింటికి వొచ్చింది. తానైతే అల వాటు మార్చుకోలేదు కాని మామయ్య, అత్తయ్య దాన్ని అతిక్రమించి చిలకా గోరింకల్లా సినిమాకు పోయారు. ఆ ధైర్యం చూసుకుని తనగదిలో సిగరెట్ కాల్చుకుంటూ కూచున్న బావ ఆమెను చూసి "హలో డార్లింగ్'' అన్నాడు.

"గూబ గుయ్ మనగలదు" అన్నది హేమలత.

"అప్పుడు నేను ప్రబంధనాయకుడ్ని కాకపోతానా ?... ఏమిటి విశేషాలు ? ఈ ఏడు గ్యారంటీగా ఫెయిలవుతావా, లేదా ?''

"నీలాగా మట్టిబుర్రను కాను''

''ఏమన్నావ్ ?"

మీదికి రాబోయిన బావను తప్పించు కుందామన్న తొందర్లో పరికిణీ కాళ్ళకి అడ్డంపడి ముందుకు తూలిపోయింది హేమలత. వొక్కపరుగున వొచ్చి ఆమె జెడపుచ్చుకున్న బావ ఆదుకుని ఆమెను మంచంమీదికి తోసేశాడు. "ఇంకెప్పు డన్నా అంటావా ? కిత కితలు పెట్టనా ?" అంటూ. "అనను బాబోయ్'' అన్నది కిత కితలు పెట్టకుండానే నవ్వుతూ, రొప్పుతూ హేమలత.

బావ మంచంమీద కూచుని తదేకంగా ఆమెవంకచూసి ''వొక్కమాట చెప్పనా హేమా ?" అన్నాడు.

"ఏమిటో అంతగొప్పమాట ?" అన్న దామె అలాగే వెల్లకితలా పడుకొని.

"నువ్వుచాలా అందంగా వుంటావు"

"మరి అందరూ నీలాగే కోతిలా వుంటారా ?''

చిన్ననాటినుంచీ వొక్కచోట పెరిగిన చనువు అది. ఎప్పుడో నిశ్చయం అయి పోయిన బంధంకూడాను. అయినా బావ మగవాడు. వేళాకోళానికి ఉడుక్కుని కితకితలు పెడదామని ముందుకు వంగాడు. ఆ తరువాత ...

ఆ తరువాత ఏం జరిగిందో నెలరోజుల తర్వాత బైటపడింది. ఆమె అమ్మా నాన్న నెత్తీ నోరు బాదుకుంటే హేమలత నిజం చెప్పేసింది. ఆ నిజం వాళ్ళ కంగారుతగ్గిం చేసినా అనుమానం మాత్రం పోగొట్టలేదు. నాన్న ఆనాడేపోయి మామయ్యతో మాట్లాడాడు జరిగిన 'అప్రదిష్ట ముచ్చట' కూడా చెప్పేసి.

మామయ్య రెండురోజులు ఆలోచించి మూడో రోజున "వాడుచేసుకోనంటు న్నాడ్రా ?' అన్నాడు. తన కాలికింద భూమి అదృశ్యమై పోయినట్లయింది హేమలతకి. పైగా ''మనోనిగ్రహంలేని దాంతో మనువా ?" అన్నారు ధర్మసంస్థా పకులు.

తన జీవితం నరకం అయిపోయింది అనిపించింది హేమలతకు ఆ క్షణాన. ఈ సంగతి నలుగురు నోళ్ళలో నూ వొక్కకముందే మకాం గుంటూరుమార్చి

ఆమెని మళ్ళీ చదువులో పెట్టారు. అమ్మా నాన్న ఆనాటినుంచీ ఈనాటివరకూ ఏ విషయంలోనూ నోరెత్తి వొక్క మాట కూడా ఆమెతో అనలేదు.

అది హేమలతలో తెచ్చిన మార్పు చిత్రమైనది. అల్లరి పిల్లకి ఆరిందాతనం వొచ్చింది. అంతేకాదు. బాగా దగ్గరగా పరిశీలించినవారికి ఆమెలో వొకరకమైన నిస్పృహ కనిపించింది. అయితేనేం? ఆమె అతినాజూకుగా, నాగరికంగా తయారైంది. అంగసౌష్ఠవంలో లోపంలేదేమో ఆమెమూర్తి కలతపెట్టని మొగాడులేడు. అందుకామె సిగ్గుపడలేదు. శరీరంమీద అభిమానమూ, దాన్ని దాచుకోవాల్సిన అగత్యమూ ఉండాలన్న సూత్రం ఆమెకు పట్టలేదు. ఆకలైననాడు అన్నం తిన్నది. అంతే!...

ఇప్పుడు తాను హైద్రాబాదు రావటానికి కారణం అదికాదు. ఎంతచంపుకున్నా మనసులో శేఖరానిని చూడాలనే వాంఛ పోలేదు. అంతరాంతరాల్లోనుంచి అతని యింటో వొకటి రెండు ఘడియలు అతిధిగా – కేవలం అతిధిగా గడపాలన్న వాంఛ ఉబికివచ్చింది. అతన్నిచూసి అతని సుఖాన్నీ సంతోషాన్నీ హోదానీ చూసి ఆనందించాలన్న ఉబలాటం కలిగింది.

వొచ్చింది.

ఇంకొక్కరోజు! అతను తనను గురించి ఏమనుకున్నా ఫరవాలేదు.



"బాబూ, అమ్మగారితోచెప్పి ఒక ముద్ద అన్నం పెట్టించండి."

"హుఁ. అమ్మగార్ని అడిగే ధైర్యమే వుంటే ప్రొద్దుటినుంచి ఉపవాసం చెయ్యట మెందుకు."

ఆ వొక్కరోజుకోసమూ ఆ అవమానాన్ని తాను భరించగలదు. ఆరోజు గడిచాక తాను వుండదు. మరి తనకూ వొక జీవితం అంటూ వుందికదా? ఉద్యోగం – అమ్మా నాన్నా అంతా వున్నారు. అదేగా తనకీనాడు జీవితంమరి?

హేమలతకు పెద్దగా నవ్వాలనిపించింది.

అయినా దిండులో తలదూర్చి కళ్ళు గట్టిగా మూసుకున్నది.

* * *

గదిలో తమలపాకులు వేసుకుంటూ "హేమ యింకా ఎన్నాళ్ళు వుంటా నన్నది'' అన్నాడు శేఖరం.

"రేపో ఎల్లుండో వెళ్ళిపోతుంది'' అన్నది రేణుక.

శేఖరం వొక్క క్షణం తటపటాయించి చివరకి ''ఆమెతో నువ్వలా పూసుకు తిరగటం బాగోలేదు రేణూ! రోజు లసలే మంచివికావు'' అన్నాడు.

రేణుకకి అతనిభావం అర్థంకాలేదు. "ఇంటికొచ్చిన బంధువుతో మాట్లాడ వలసిన అవసరంకూడా లేదంటారు?'' అన్నది.

''అదికాదు!... దాని ప్రవర్తనా నమ్మకాలూ నాకంత బాగుండవు... అన్నీ చాలా నీచమైన వూహలు." అంతకన్నా ఎలా చెప్పాలో అతనికి అర్థం అయినట్లులేదు.

"అంతేకదా? ఎవరిసరదాలు వాళ్ళ కుంటాయి ... మొగవాళ్ల దుస్తుల విష యంలో ఎన్ని ఎత్రివేషా లెయ్యడం లేదు? అవన్నీ సరైనవీనూ, ఆమె నైలాన్‌చీర సభ్యతానా?"

"దుస్తులసంగతి కాదు''

"చాల్లెండి! పెళ్ళికానిపిల్ల గురించి అలా మాట్లాడటం ఎవరికీ తగదు?''

"దాని కెందుకు పెళ్ళికాలేదో నీకు తెలుసా?"

''ఎందుకు కాలేదు?''

"కన్యగానే గర్భవతిఅయింది కనక."

రేణుక తెల్లబోయి ''అయితే...?" అన్నది సందిగ్ధంగా.

''అవునురేణూ! నే నెప్పుడూ చెప్పే అమ్మాయే యీ హేమలత...వొకసారి కాలుజారినదాన్ని ఎన్నడూ క్షమించక పోవటం అనేది దౌర్బల్యం అని నేనూ వాదించానప్పుడు. మా అమ్మా నాన్నా వినిపించుకోలేదు. ఆ తరువాత ఆమె ఎన్నిరకాలుగా మారిందో ఎంత అధః పతనం చెందిందో విన్నప్పుడు అమ్మా నాన్నలమాట నిజమేనని అంగీకరించక తప్పలేదు. ఎవరికెప్పుడు ఏం బుద్ధిపుడు తుందో చెప్పలేం. దానికి స్క్రూపుల్స్ అనేవి బొత్తిగాలేవు. అందువల్ల నాకన్న నీకే ఎక్కువనష్టం''

రేణుక స్థాణువై పోయింది. టిప్ టాప్‌గా దుస్తులు వేసుకున్న నాగుబాము ఆమె కన్నులముందు నాట్యమాడ సాగింది. ఎంత ఘోరం? కాని...కాని...

తాను కొన్ని గంటలక్రితం హేమలత ఎవరో తెలీకుండా అన్నమాటలు ఆమె నేమీ కదిలించినట్లులేవే? అంతగా దిగ జారిపోయిందా ఆమె? రామరామ! ఈ దేశంలోని గౌరవ కుటుంబస్త్రీలు ఎంతకి దిగజారారు?

"మరేం భయపడకులే! రేపుకూడా ఉన్నంతమాత్రాన దానివల్ల కొంపేమీ మునగదు. నామీద నీకూ, నీమీద నాకూ ఆమాత్రం ధైర్యం వున్నది. ముందు జాగ్రత్తకోసం ఇదంతా చెబుతున్నాను.

రేపొక్కరోజూ కళ్ళుమూసుకుంటే ఇక దాని బెడద వుండదు''

"మళ్ళీ రానివ్వటం కూడానా ?''

ఎంతభయంతో, జుగుప్సతో రేణుక ఆమాట అన్నదో గ్రహించిన శేఖరం ఆమె అమాయకత్వానికి నవ్వుకున్నాడు. అవునుమరి! తనకాపరంకన్న స్వర్గం లేదు స్త్రీకి. అందులో మరొకరి ప్రవేశం బాధాకరమే.

"ఇంత అమాయకురాలివేం రేణూ?" అంటూ అతడామెను దగ్గరకు తీసుకున్నాడు.

* * *

తెల్లవారింది.

హేమలతకి గతరోజు జరిగిన అనుభవం మరపుకు రాలేదు. మరో స్త్రీ ఆమె పరిస్థితుల్లో వుంటే వెళ్ళిపోయేదేమో! ఆమెకుమాత్రం పోవాలనిపించలేదు. అది శేఖరంమీద పగతీర్చుకోవటమూ కాదు, పట్టుదలా కాదు. కనపడక కనపడక కనపడిన చిన్ననాటి నెచ్చెలిని తనివితీరా చూడక ఎలా వెళ్ళటమో ఆమె అర్థం చేసుకోలేకపోయింది. రేణుక అతనికి అడుగడుగునా ప్రతిదాంట్లోనూ సాయపడుతూ తద్భూతమైన అలౌకికానందాన్ని అనుభవిస్తోంటే అది కనులారాచూసి మనసును మధురం చేసుకుంటున్నది. తనకు కలుగవలసిన అదృష్టం ఆమెకు కలిగినందుకు హేమలత అసూయపడలేదు. ఆయింట్లో తనకున్న స్థానం ఎవరికీ లేదని తృప్తిపడింది. రేణుక అతనికి భార్యమాత్రమే! తాను ?

తాను రేణుకకన్నా ఎలా ఎక్కువా అని అడిగితే హేమలతదగ్గర సమాధానం సిద్ధంగానే ఉన్నది. పుట్టి బుద్ధెరిగిన నాటి నుంచీ శేఖరం కావాలనుకున్నది తనను. తాను శేఖరాన్ని తప్ప మరొకవ్యక్తిని ప్రేమించి ఎరుగదు. ప్రేమకన్నా బాంధవ్యం ఎలా గొప్పది? బాంధవ్యం లోనూ ప్రేమవుంటే వుండవచ్చుగాక! అది ఏనాడూ తనప్రేమను మించలేదు.

హేమలత ఆరోజుల్లా అలాగే అనుకుంటూ గడిపింది. సాయింత్రం స్నానం చేసి దుస్తులు వేసుకుని రేణుకవున్న గదిలోకివొచ్చి "నేను రేపు వెళ్ళిపోవాలి కదమ్మా! బజారు పోయొద్దాం, వొస్తావా?" అన్నది.

రేణుక ఆమె ఏకవచన సంబోధనకి విసుగు చెందినా అది మనసులోనే దాచుకుని "దేనికి!'' అన్నది.

"షాపింగ్‌కి''

కటువుగా సమాధానం యిద్దామనుకున్న రేణుక అది చేతగాక "ఆయన వొచ్చేవేళయింది" అన్నది.

"అయితే నే వెళ్ళిరానా ?''

"అలాగే"

హేమలత బయటికివచ్చింది. మెట్లు దిగబోతుండగా రేణుక రివ్వునవొచ్చి,

"ఆగండి'' అన్నది.

హేమలత ఆగి "ఏమిటి?'' అన్నది.

''మీకు అభ్యంతరం లేకపోతే షాపింగ్‌కి నేను వెళ్తాను''

''అంటే సువ్వొక్కర్తి వేనా?'' అన్నది హేమలత అయోమయంగా.

''ఔను.''

''సరే! నీయిష్టం. మరి మీఆయన వొస్తే ఏం చెప్పను?"

''ఆయన రారులెండి! మీకేంకావాలో చెప్పండి''

హేమలత డబ్బుతీసియిచ్చి వొకచీరె, రవికగుడ్డ తెమ్మన్నది. రేణుక అది తీసుకుని గబగబా వెళ్ళిపోయింది.

'రానని ఫోన్ చేశాడుగావును శేఖరం' అనుకున్నదేగాని జరిగిందేమిటో ఊహించలేకపోయింది హేమలత. తోవలో ఎదురు రాగల అవకాశమున్న శేఖరంతో హేమలత వొంటిగా వుండడం యిష్టంలేక రేణుకే అతనికి ఫోనుచేసి ఫలానా చోటికి రమ్మన్నదని ఆమెకెలా తెలుస్తుంది? లోపలకువొచ్చి శేఖరం గది లోకి వెళ్ళింది హేమలత. బల్లమీద అతనూ రేణుకా వున్న ఫోటోల స్టాండు కనిపించింది. హేమలత దానిముందు కూచుని ఫోటో చేతిలోకి తీసుకున్నది.

పెళ్ళిబట్టల్లో ఎంత అందంగా వున్నాడు శేఖరం! తలంటి పోసుకున్నాడేమో ముంగురులు నుదుటిపైకి పడుతున్నాయి. హేమలతకి హఠాత్తుగా వో ఆలోచన వొచ్చింది. వెంటనే తనగది లోకి వెళ్ళి తన మనీపర్సులో ఏనాడో అతను తీసిన ఫోటో తీసుకు వొచ్చింది. ఫొటోస్టాండు విప్పి రేణుక బొమ్మఉన్న ప్రదేశంలో ఆఫోటో పెట్టింది.

ఎంత బావుంది ఆదృశ్యం!

అలాగే ఆ ఫొటోవంకచూస్తూ హేమలత ఎంతసేపు కూర్చుండి పోయిందో! గడిచిపోయిన రోజులన్నీ నెమ్మది నెమ్మదిగా జ్ఞాపకానికి వొచ్చి ఆమె గుండెలు ఆర్ద్రమైనాయి. ఏదైనా మాయో మంత్రమో జరిగి వొక్కలిప్త పాటు తాను అతడి పాదాలను స్పృశింప గలిగితే? అది జరిగేపనేనా? వొక్కసారి వొకే వొక్కసారి అతడు తనను పాత ఆత్మీయతతో, అనురాగంతో 'హేమా! హేమీ!' అంటే ఎంతబాగుండును! చిన్ననాటివలెనే తనజడ పుచ్చుకులాగి, తాను ఎవరికీ తెలియకుండా కోసుకువచ్చిన కామాచికాయల్లో వాటాయిచ్చి తామిద్దరూ అవి తింటుంటే, వొకరికొకరు అందించు కుంటుంటే కలిగిన ఆనందమూ హాయీ మరొక్కసారి ... వొక్క లిప్తపాటు కలిగితే ఎంతబాగుండును! కాని అది జరిగేదేనా? తనది పేరాశ! తనకోసం కాలాన్ని వెనక్కి తిప్పితే అతనితో ప్రయాణించేవా రేమయిపోతారు?

హేమలత ఫొటోలోని శేఖరం పాదాలను కళ్ళకద్దుకున్నది. స్టాండును గుండెల కదుముకుని అలాగే కుర్చీలోకి వాలి పోయింది. ఉన్నట్లుండి ఎక్కడనుంచో

వొక ఆడగొంతు "అది నా హక్కు! నువ్వెవరవు? ఫో!" అన్నది. హేమలత ఉలిక్కిపడింది. అది రేణుక గొంతు కాదూ?

స్టాండు బల్లమీద పెట్టేసి మరొక్కసారి దానివంక పరిశీలనగా చూసింది. ఆమె ఇచ్ఛతో పనిలేకుండా కన్నులు వర్షించ సాగాయి. దృశ్యం మసకవుతుంటే చెంగుతో తుడుచుకుంటూ స్టాండులోని తనఫొటో యివతలకుతీసి రేణుక ఫొటో పెట్టేసింది. ఆఫోటో ఎంత అదృష్టవంతురాలు! తాను?

హేమలత కన్నులు తుడుచుకున్నది. లేచి వెనుదిరగబోయి అద్దంలో కనిపించిన దృశ్యంచూసి ఆశ్చర్యంతో వెనుదిరిగింది. ఆమె వెనుకే నిలుచునివున్న శేఖరం నవ్వుముఖంతో ఆమెచెయ్యి పట్టుకుని "వొంటరిగా కూచుని కన్నీళ్లు కారుస్తున్నావా?" అన్నాడు.

హేమలత తల వొంచుకున్నది.


శేఖరం అలాగే ఆమెను అక్కడ వున్న మంచంవద్దకు తీసుకుపోయాడు. ''కూచో'' అన్నాడు తానూ కూచుంటూ.

''రేణుక రాలేదూ?'' అన్నదామె.

అతనునవ్వి "నాకోసం ఎగ్జిబిషన్ దగ్గర వెయిట్ చేస్తుంటుంది." అన్నాడు.

"అయితే నువ్వు...''

''వెళదామనే అనుకున్నాను. చివరి క్షణాన వెళ్ళబుద్ధి కాలేదు ... కూచో హేమా'' అన్నడతను.



"నాలుగు చేపలు ఇలా విసరవయ్యా!"

"విసరడం ఎందుకు, ఇలా వచ్చి తీసుకోండి."

"నేను చేపలు పట్టందే పట్టేను అని మా ఆవిడతో అబద్ధం ఆడడం ఇష్టం లేదు. నువ్వు రెండు విసిరితే పట్టుకుని తీసుకెళ్తా."

---

హేమలత మంచంవారగా కూర్చున్నది.

''ఏమిటి ఆలోచిస్తున్నావు?'' అన్నడతను.

"ఏమీలేదు''

"నన్నుగురించి కదూ?''

''అవును"

''మరి ఏమీ లేదన్నావేం?"

హేమలత జవాబు చెప్పలేదు.

"నేనూ నిన్నుగురించి చాలాసార్లు

ఆలోచించాను హేమా!... ఆరోజుని నా జీవితంలో మర్చిపోను''

"ఎవరు మర్చిపోయారు ?''

''అయితే నీకూ జ్ఞాపకం వుందా ?'' అన్నాడతను ఆత్రంగా.

హేమలత నవ్వింది 'పిచ్చివాడా' అన్నట్లు.

"రేణుకకి నీసంగతంతా చెప్పాను.''

"చెప్పింది''

''నీకు కోపంరాలేదూ ?''

"ఎందుకు ?"

''సాధారణంగా ఆపరిస్థితుల్లో అందరికీ వొస్తుంది...కాని ఏం చెయ్యను చెప్పు ? మరొకరెవరో నీసంగతి చెప్పి ఆసంగతి అది నన్నడిగినప్పుడు నేను చెప్పాల్సిరావటంవల్ల తయారవ గల సీనుని ఊహించగానే భయంవేసింది. నీసంగతి ఎప్పుడు తెలిసినా కలిగేది రోతే దానికి.''

"నీకు అలా కలగలేదా ?''

"అంత రాక్షసుడి ననుకుంటు న్నావా ?''

''ఎందు కనుకోవాలి ?...ఎవరికైనా కొన్ని ఊహలూ నమ్మకాలూ వుంటాయి కదా ? ఆ ఊహలు బలపడేస్థితి వొస్తే అది నమ్మకం అయితీరుతుంది''

శేఖరం అర్థం చేసుకున్నాడు. ''అయితే మరి నేనుదోషినే'' అన్నాడు తలవొంచుకుని.

హేమలత అతనివంక చూసింది. అతను తొడుక్కున్నవి ఆఫీసు బట్టలుకావు. పల్చని గ్లాస్కో లాల్చీలోనుంచి పచ్చటి వొళ్ళు మెరుస్తున్నది. లుంగీచివర ఆకు జోళ్ళు వయ్యారంగా కదులుతున్నాయి. అతను ఇంటికి తిరిగిరాగానే తనకంట పడలేదు.

"రేపు వెళ్ళిపోతున్నాను శేఖరం'' అన్నదామె.

''నీ యిష్టం"

"మరి నాకూ ఉద్యోగమూ అదీ వున్నది గదా ?''

శేఖరం వొక్కక్షణం ఆగి "నేను నిన్నుచూసిన క్షణానే నేను చేసిన ఘోర మైన తప్పిదం అర్థంచేసుకున్నాను. క్షమించమనేందుకుకూడా అర్హత లేకుండా చేసుకున్నాను.'' అన్నాడు.

"ఏం చెయ్యమంటావు ?" అన్న దామె సన్నగానవ్వి.

"చేస్తావా ?'' అన్నాడతను.

''నాబావ కోరిన సబబైన కోరికను కాదంటానా ?''

"అయితే...నీకు జ్ఞాపకం వుందిగా! ఆరోజుల్లో ఎప్పుడైనా మనకు కోపాలొస్తే వొకరిపక్కన వొకరు కూచుని పోగొట్టు కునేవాళ్ళం. ఇంట్లోవాళ్ళో, బళ్ళో మాస్టరో కోప్పడితే వోదార్చుకునేవాళ్ళం. అలాగే ఈ రోజూ నీ మెత్తని చేతివేళ్ళు నన్ను లాలించగలవా హేమా ?''



"నువ్విప్పుడు పరాయివాడివి కదూ?"

"అయితేనేం ? ఒంటరివేళ...నా కోరిక అనుచితమైందికాదని నువ్వే ఒప్పుకున్నావు. మరి..." అన్నాడతను ఆమె చెయ్యిపట్టుకుని.

ఆమె దిగ్గునలేచి నిలువబడింది. "ఆ హక్కుకలవారు వేరేఉన్నారు కదూ?" అన్నది.

శేఖరం గొంతు ఆవేశంతో పూడిపోయింది : "ఆ సంగతులేవీ నాకు తెలీవు...ఒక్కసారి...మరొక్కసారి ఆ రోజు గుర్తువస్తేచాలు. కాదనకు హేమా" అన్నాడు ఆమెను దగ్గరకు లాక్కుంటూ.

హేమలతకు నిలువెల్లా కంపం కలిగింది. తానిక లొంగిపోకతప్పదు. ఈ

పరిణామం శక్తి అలాంటిది. కాని తాను రేణుకకు అన్యాయం చేస్తున్నది. ఆ తలపు రాగానే ఆమె వొదిలించుకోవటానికి యత్నిస్తూ "ఇది అన్యాయం శేఖరం... అన్యాయం" అన్నది. శేఖరం అది వినిపించుకునే స్థితిలో లేదు.

అదేసమయాన ఢణాలున వెనక తలుపు తెరుచుకున్నది!

చేతిలో పాకెట్‌తో లోపలకువచ్చిన రేణుక గుమ్మంలోనే నిశ్చేష్టురాలై ఆగిపోయింది. ఆమెకు భర్తమీద చెప్పరానంత అసహ్యం కలిగింది. "ఛీ!" అన్నది పాకెట్ విసిరికొడుతూ.

శేఖరం మంచంమీద కూలబడిపోయాడు. తొలగిపోయిన పైటను సరిదిద్దుకుని కుర్చీలో కూలబడిపోయింది హేమలత. రేణుక కంపిస్తున్న గొంతుకతో "ఇదేనా మీరు చెప్పింది?" అన్నది చాలా సేపటికి.

శేఖరం జవాబు చెప్పలేదు.

హేమలత సర్వేంద్రియాలూ అవమాన భారంతో కృంగిపోసాగాయి. చుట్టమై చూడవచ్చిన తాను... తన ప్రభావం ఈ పచ్చని కాపురంమీద చూపించిందా? ఆమె పెదవులు కదిలాయి ఏదో అనటానికి.

ఇంతలో శేఖరమే "నా తప్పేముంది?" అన్నాడు.

హేమలత ఆ మాటకు తృళ్ళిపడలేదు. మరొక మాట అతను అనివున్నట్లైతే ఆశ్చర్యపోయేదేమో? ఆ మాట అతను అన్న వెంటనే ఆమె రేణుక వంక చూసింది.

రేణుక చూపుల్లో అణువణువునా ఆమె మీద అసహ్యమూ, ద్వేషమూ పొంగి పొరలినాయి. క్రోధావేశంతో ఆమె ముఖం ఎర్రబడింది.

బలవంతాన నిలవదొక్కుకుని "ఇంత అన్యాయం తలపెడతారా హేమలత గారూ?" అన్నదామె.

అంతే! ఆ తరువాత ఆమె ఏమన్నదో హేమలత వినలేదు. కుర్చీపైన వాలిపోయి భోరుమని వెక్కివెక్కి ఏడ్వసాగింది.

